దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 1(నమస్తే తెలంగాణ): ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూ చించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను కలెక్టర్ శశాంక..అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కా ర్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 1: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 178 మంది ఫిర్యాదులను అందజేశారు. వాటిని సత్వరంగా పరిష్కరం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్డీవో వాసుచంద్ర, జడ్పీసీఈవో సుధీర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో..

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

మర్యాదగా వ్యవహరించాలి

- పెద్దేముల్ ఠాణా ఆకస్మిక తనిఖీ
- సిబ్బందికి పలు సూచనలు, సలహాలు

ఠాణా చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలిస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

పెద్దేముల్, జూలై 1 : పోలీసులు ప్రజల మనసులు గెలిచేలా విధులు నిర్వహించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఠాణాను ఆయన తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పీఎస్‌లోని రైటర్ గది, బ్యారెక్‌లు, చుట్టు పక్కన ఉన్న పరిసరాలు, పాత పోలీస్‌స్టేషన్, ఎస్ఐ క్వార్టర్స్, పట్టుబడ్డ వాహనాలను పరిశీలించి డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించి.. సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రతి ఫిర్యాదునూ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి ఫాలోఅప్ చేయాలన్నారు. 100 డయల్ కాల్‌లకు వెంటనే స్పందించి ఘటనాస్థలానికి త్వరగా చేరుకోవాలని.. ఠాణా పరిధి లో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపానీయాల విక్రయా లపై ఉక్కుపాదం మోపాలన్నారు. రైతుల కు నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఆయన స్థానిక పోలీసుల ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించారు. తాండూరు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు ఎస్పీకి పూల మొక్కలు అందించి ఘనస్వాగతం పలికారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ అశోక్‌గౌడ్, పెద్దేముల్ ఎస్ఐ గిరి, ఏఎస్ఐ బక్కన్న, హెడ్ కానిస్టేబుళ్లు రమేశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పంటల సాగులో పురుగుమందులు వాడొద్దు

జూల్లీహిల్స్, జూలై 1 : తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టీడీఎఫ్) జైకిసాన్ బాసట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మోకిలలో రైతులు, కాలనీవాసులకు దేశీ విత్తనాలు, ప్రకృతి వ్యవసాయం, రసాయన రహిత పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి టీడీఎఫ్ జైకిసాన్ ఇండియా చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. రసాయనాల్లేని పంటలను పండించి మొదట రైతులు, రైతు కుటుంబాలు వాటి స్వచ్ఛమైన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలన్నారు.

ఈ సందర్భంగా ఆయన రైతులకు టీడీఎఫ్ జైకిసాన్ నుంచి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం టీడీఎఫ్ వనిత చేయూత, బాసట ఫౌండేషన్ అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. పంటల సాగులో హానికరమైన రసాయన మందులు, పురుగు మందుల వాడాకాన్ని తగ్గించాలన్నారు. ఆయా రసాయనాలతో క్యాన్సర్ తదితర ప్రమాదకర వ్యాధుల బారిన పడతామన్నారు. భావితరాలకు మంచి నేల, ఆరోగ్యం ఇవ్వాలని..గాలి, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, రైతులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు .. చిత్రంలో పక్కన బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నా ప్రయాణం.. బీఆర్ఎస్‌తోనే..

- పార్టీ మారుతున్నట్లు వస్తున్నవి పుకార్లే
- ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి
- ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్
- ఉప్పల చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, జూలై 1 : నా ప్రయాణం..బీఆర్ఎస్‌తోనే అని.. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారానని ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజాప్రతినిధులకు ప్రజాసేవ పురస్కారం, సత్కార కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే నా ప్రయాణమని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న పుకార్లపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తానన్నారు. తాను ఎమ్మెల్సీగా పోటీ నుంచి తప్పుకుంటే కాంగ్రెస్ పార్టీ రూ.30 కోట్లతోపాటు కార్పొరేషన్ పదవిని ఇస్తానని ప్రలోభాలకు గురి చేసినా తాను బరిలోనే ఉన్నానని చెప్పారు. సీఎం సొంత జిల్లాలో తాను బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా విజ యం సాధించడం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటి సమాధానమన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలను నిలుపుదల చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో ఉండడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి నీచమై న సంస్కృతికి తెరలేపారని మండిపడ్డారు. తలకొండపల్లి జడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల వెంకటేశ్..ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తు న్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కా ర్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఆనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వా రా ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నాయకుడు మోతీలాల్‌నాయక్ గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని.. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఏడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. దవాఖానల్లో వైద్యులు లేనప్పుడు.. విద్యాలయాల్లో అధ్యాపకులు లేనప్పుడు ప్రజలకు సమస్యలొస్తే వారి తరపున ప్రజాప్రతినిధులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. తాను ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చానన్నారు. 25వేల మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు, ఆరువేల మందికి ఇండ్ల నిర్మాణం, వేలాది మం ది విద్యార్థులను చదివించడంతోపాటు కొవిడ్ మహమ్మారి సమయంలో 14,500 మందికి నివారణ కిట్లు అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్ , ఎంపీపీలు నిర్మల, మనోరమ, విజయ, వైస్ ఎంపీపీ లు ఆనంద్, శంకర్‌నాయక్, శాంతి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజఫర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పత్యానాయక్ , ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులూ.. ఆందోళన చెందొద్దు..

- భూములిచ్చిన వారికి ఉద్యోగం, నగదు, ఇంటి స్థలం ఇస్తాం
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసరావు

ప్రభుత్వం అండగా ఉంటుంది

రైతులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి, ఆర్డీవో

కొడంగల్, జూలై 1 : మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని 19 సర్వే నంబర్ రైతులు ఆందోళన చెందొద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మెడికల్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు సర్వే నం. 19లో భూ సేకరణ నిమిత్తం రైతులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులతో అధికారులు నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించడంతోపాటు ప్రభుత్వం అందించే సౌకర్యాలను వివరించారు. మెడికల్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు 60 ఎకరాల స్థలం అవసరమని.. అందుకు సర్వే నం.19లోని 74 ఎకరాల నుంచి రైతుల ఆమోదంతో 60 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు ఈ మీటింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాగా రైతులు తమ తమ అభిప్రాయాలను అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు స్థలాలు ఇచ్చే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారికి ఎకరానికి రూ.10 లక్షలతోపాటు ఉద్యోగం, డీటీసీపీ లే-అవుట్‌తో కూడిన ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రీ-సర్వే చేయించాలని వినతి

కొత్తూరు, జూలై 1 : సిద్ధాపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని రీ-సర్వే చేయించాలని ఎమ్మెల్యే శంకర్ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయన సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి హద్దులను గుర్తించాలని.. సిద్ధాపూర్‌లో నిరుపేదలు చాలామంది ఉన్నారని వారికి ఇండ్ల స్థలాల కోసం కొంత స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఆట స్థలానికీ కొంత స్థలం ఇవ్వాలన్నారు. స్పందించిన మంత్రి వెంటనే రంగారెడ్డి కలెక్టర్‌కు ఫోన్ చేసి సిద్ధాపూర్‌లోని ప్రభు త్వ భూమిని సర్వే చేయించి హద్దులను గుర్తించాలని ఆదేశించారు.

రైతులను వేధిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

విద్యుత్తు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్, జూలై 1 : విధుల నిర్వహణ లో అవినీతికి పాల్పడే విద్యుత్తు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్తు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యుత్తు పనుల్లో రైతులను సిబ్బంది వేధించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. షాబాద్, నాగరకుంట గ్రామాల్లో విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ పనుల విషయంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. గ్రామాల్లో ఉన్న విద్యు త్తు సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఎంసీపీఐ(యూ) ధర్నా

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

రంగారెడ్డి, జూలై 1 (నమస్తే తెలంగాణ) : ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక, నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(యునైటెడ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ)నాయకులు మాట్లాడుతూ గత పదేండ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడమే కాకుండా కార్మిక, రైతాంగ, ఆదివాసీ, గిరిజన వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. నూతన న్యాయ చట్టాలతో సామాన్యులపైనా దేశద్రోహం వంటి కేసులు పెట్టి అణచివేతకు గురిచేసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశా రు. మియాపూర్‌లో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని వదిలేసి పేదలపై ప్రతా పం చూపడం సరైంది కాదన్నారు. 30 ఏం డ్లుగా నివాసం ఉంటున్న పేదలకు నోటీసు లు ఇవ్వడం తగదన్నారు.

ధర్నా అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సమయానికి సాయమందించాలి

- రైతుభరోసా అభిప్రాయ సేకరణలో అన్నదాతలు
- రైతుల వినతులను ప్రభుత్వానికి చేరవేస్తాం
- రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి, వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి

ధారూరులో రైతుల అభిప్రాయాల సేకరణలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

షాబాద్, జూలై 1 : గత ప్రభుత్వం రైతుబంధు డబ్బులను సకాలంలో అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కార్ కూడా రైతుభరోసా సాయాన్ని సకాలంలో అందించాలని పలువురు రైతులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసా పథకం అమలుపై రైతులతో కలిసి ప్రత్యేక మహాజన సభ ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 46 మంది రైతులు సమావేశానికి హాజరుకాగా.. 40 మంది అభిప్రాయాలను తెలిపారన్నారు. అత్యధికంగా 30 మంది రైతులు పది ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రైతుభరోసా ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. మరి కొంతమంది కౌలు రైతులకూ రైతుభరోసా అందించాలని కోరినట్లు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, వినతులను ప్రభుత్వానికి పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి, వ్యవసాయశాఖ చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం, సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, సీఈవో శివకుమార్‌రెడ్డి, డైరెక్టర్లు పర్వేద నర్సింహులు, చక్కటి దేవేందర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, రాంచందర్, నర్సింహులు, ఏఈవోలు రాజేశ్వరి, సోనిశ్రీ, కిరణ్మయి, లిఖిత, గీత తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మండల కేంద్రంలో..

ధారూరు : సాగులో ఉన్న 10 ఎకరాల్లోపు భూములకే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని మెజార్టీ రైతులు అభిప్రాయపడుతున్నారని వికారాబాద్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కౌలు రైతులకూ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు, బీడు భూములు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వెంచర్లు, ఫామ్‌హౌస్‌లకు రైతు భరోసా ఇవ్వవద్దని తెలిపారు. రైతుబీమా మాదిరిగానే పంట బీమా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సీఈవో నర్సింహులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చేవెళ్ల మండలంలో..

చేవెళ్ల రూరల్ : 10 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని గుండాల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ నక్క బుచ్చి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి హాజరై రైతుల అభిప్రాయాలను సేకరించారు. కొందరు రైతులు పది ఎకరాల్లోపు రైతుభరోసా ఇవ్వాలని కోరగా, మరి కొందరు 5 ఎకరాల్లోపు వారికి ఇవ్వాలని అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతు భరోసాకు బదులు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలని మరికొందరు రైతులు కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారిణి తులసి, ఎస్డీఈవో సత్యనారాయణరెడ్డి, గుండాల పీఏసీఎస్ సీఈవో మధుసూదన్, ఏఈవో, పీఏసీఎస్ వైస్ చైర్మన్, పీఏసీఎస్ డైరెక్టర్లు, గ్రామానికి చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు.

లోపాలను ముందే గుర్తించి మరమ్మతులు..

సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ): చిన్న చిన్న లోపాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, ముందుగానే గుర్తించి మరమ్మతులు చేసేందుకు విద్యుత్ శాఖ అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన థర్మో విజన్ కెమెరాలను వినియోగిస్తున్నదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లోని డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలో నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ ఇటీవల 35 అత్యాధునిక థర్మోవిజన్ కెమెరాలను కొనుగోలు చేసిందన్నారు. వీటిని గ్రేటర్ పరిధిలో ఉన్న 9 సర్కిళ్లలో క్షేత్ర స్థాయిలో పనిచేసే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పంపిణీ చేశామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

యాచారం : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని యాచారం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ గోపాల్ కథనం ప్రకారం.. మంచాలకు చెందిన బైక్ మెకానిక్ బండారి శివ, మండలంలోని గాండ్లగూడ గ్రామానికి చెందిన ఉదయ్ గంజాయిని తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని మండలంలోని గాండ్లగూడ వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో వారిని ఠాణాను తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.